మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
కావలెను
'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.
కావలసిన ప్రాంతాలు :
కరీంనగర్ జిల్లా : సైదాపూర్, గంగాధర, గన్నేరువరం, హుజురాబాద్ ఆర్.సి. రామడుగు
జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలలో స్టాఫ్ రిపోర్టర్లు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
సాయికృష్ణ థియేటర్ ఎదురుగా
భగత్‌నగర్, కరీంనగర్.
పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
సెల్ : 83339 98076



మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
శుక్రవారం | 15 | సెప్టెంబర్ | 2023 | పేజీలు : 9

# జమిలీ కాకపోతే... కరీంనగర్ అసెంబ్లీ బరిలో దిగుతా..

- గంగులతో కుమ్మక్కనడం మూర్ఖుల దుష్ప్రచారం
- పార్లమెంట్ సమావేశాలు, అమెరికా పర్యటనలో ఉంటే కోర్టుకెలా హాజరవుతా?
- జమిలీ ఎన్నికలొస్తే... బిఆర్ఎస్ నేతలకు డిపాజిట్లు కూడా రావు

: బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): రాబోయే ఎన్నికలు జమిలీ పద్ధతితో జరగని పక్షంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. మంత్రి గంగుల కమలాకర్‌తో తాను కుమ్మక్కైనట్లు పలువురు చేస్తోన్న ప్రకటనలను కొట్టిపారేశారు. కొంతమంది మూర్ఖులు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశం కోసం, ధర్మం కోసం నిరంతరం ప్రజా సమస్యలపై కొట్లాడే వ్యక్తినే తప్ప కుమ్ముక్కు రాజకీయాలు తనకు తెలియవని స్పష్టం చేశారు. తనపై దుష్ప్రచారం చేసే మూర్ఖులకు దమ్ముంటే తనతో నేరుగా కొట్లాడాలని సూచించారు. తాను పార్లమెంట్ సమావేశాలకు హాజరు కావడం, అమెరికా పర్యటనలో ఉండటంవల్లే కోర్టుకు హాజరుకాలేకపోయానని చెప్పారు. బుధవారం కరీంనగర్‌లో ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ నోటికొచ్చిన రీతిలో వ్యాఖ్యలు చేసే వారి గురించి తాను పట్టించుకోనన్నారు. నిరుద్యోగులకు కెసిఆర్ సర్కార్ చేసిన మోసాల బండారం బయటపడుతుందనే భయంతోనే బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి చేపట్టిన దీక్షను భగ్నం చేశారన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచిన కెసిఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల పొట్టకొడుతోందని వ్యాఖ్యానించారు. ఉద్యోగులు రిటైర్డ్ అయితే బెనిఫిట్స్ ఇవ్వడానికి కూడా సొమ్ము లేకపోవడంతోనే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతున్నారన్నారు. తెలంగాణను ఐదున్నర లక్షల కోట్ల అప్పుల పాలుచేసిన కెసిఆర్ ప్రభుత్వం, భూములమ్మితేనే ఉద్యోగులకు జీతాలిచ్చే దుస్థితిలో ఉందన్నారు. కెసిఆర్ చెల్లని రూపాయిలా మారారని, మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే అప్పులెలా తీరుస్తారో సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. కెసిఆర్‌కు బిజెపి అంటేనే భయం వేస్తోందని, అందుకే కాంగ్రెస్‌ను జాకీ పెట్టి లేపే కుట్ర చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎలాగూ అధికారంలోకి రాదని, అందుకే అడ్డగోలు హామీలతో ఆకట్టుకోవాలనుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కౌలు రైతుల గురించి ఎందుకు ఏ పార్టీ పట్టించుకోవడం లేదని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఎందుకు ఆదుకోవడం లేదని, కేసీఆర్ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు... కేంద్రాన్ని బదనాం చేయడం, మోసపూరిత హామీలివ్వడం, కాంగ్రెస్ ఇమేజ్ పెంచడమే కేసీఆర్ పనిగా పెట్టుకున్నాడే తప్ప ప్రజల గురించి పట్టించుకోవడం లేదని బండి పేర్కొన్నారు. ఒవైసీ చెబితేనే సెప్టెంబర్ 17 తేదీన జాతీయ సమైక్యతా దినోత్సవంగా కేసీఆర్ ప్రకటించారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎం కాగానే నిజాం రాజు అరాచకాలన్నీ మర్చిపోయి ఆయన సమాధి వద్ద మోకరిల్లారని, నిజాం ఆస్తులపై ఆయన దృష్టి పడిందని, అందుకే ఆయనను గొప్పోడిగా చిత్రీకరిస్తూ తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను విస్మరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరిపి తీరాల్సిందేనని, కేసీఆర్‌కు చేతగాకపోవడంవల్లే కేంద్రమే అధికారికంగా విమోచన దినోత్సవాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. జమిలి ఎన్నికలంటే బీఆర్ఎస్ నేతలకు భయమెందుకని సంజయ్ ప్రశ్నించారు. జమిలీ ఎన్నికలొస్తే బిఆర్ఎస్ నేతలకు డిపాజిట్లు కూడా రావన్నారు.

**కరీంనగర్ పోలీసుల తీరు సరిగా లేదు...**

కరీంనగర్ లో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు హేయనీయమని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కరీంనగర్ లో గంజాయి

మిగతా 2లో..

## 19 లోగా ఓటర్ల నమోదు పూర్తి చేయాలి

- 2020 నాటికి ఎస్సెస్సీ పూర్తిచేసుకున్న వారంతా ఓటర్లుగా నమోదై ఉండాలి

కరీంనగర్ కలెక్టర్ గోపి

2 లో



# ఓటర్ నమోదులో నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్ సంతోష్

లక్షెట్టిపేట్, సెప్టెంబర్ 14(మనం న్యూస్): ఓటర్ నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం మండలం లోని పలు గ్రామాల్లో ఆయన ఆకస్మిక పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని లక్ష్మిపూర్ గ్రామ పంచాయతీలో ఇళ్ల స్థలాలు కేటాయించిన స్థలం పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ జెండా వెంకటాపూర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎఈపీఆర్ శృతి, జెండా వెంకటాపూర్ సర్పంచ్ సునీత, ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి లను ఆదేశించారు. అనంతరం బిఎల్ఓ సెంటర్ ను పరిశీలించిన ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫర్టిలైజర్ షాప్స్ గోదాము లు రికార్డ్స్ పరిశీలన చేసి, అక్రమాలకు పాల్పడినా, తప్పుడు లెక్కలు చూపినా తగు చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో డిఏఓ కల్పన, తహసీల్దార్ రాఘవేంద్ర రావు,ఎంపీడీఓ కే.నాగేశ్వరరెడ్డి, డిపిఎల్ఓ ఫణిందర్, లక్ష్మిపూర్ ఎంపీటీసీ దావీద్,ఎఈపీఆర్ శృతి, పంచాయతీ కార్యదర్శి నరేందర్, జెండా వెంకటాపూర్ సర్పంచ్ ఎల్తాపు సునీత సుధాకర్ పాల్గొన్నారు.



# తిరగబడదాం.. తరిమికొడదాం...

# కరపత్రాన్ని ఆవిష్కరించిన పొన్నాల లక్ష్మయ్య



కరీంనగర్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): ఈనెల 17న హైదరాబాద్ తుక్కుగూడలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ విజయభేరి బహిరంగ సభ పై సమీక్షించడంతో పాటు కెసిఆర్, నరేంద్ర మోడీ పాలనను వ్యతిరేకిస్తూ పిసిసి ముద్రించిన తిరగబడదాం.. తరిమికొడదాం.. అనే పేరిట ముద్రించిన కరపత్రాన్ని మాజీ పిసిసి అధ్యక్షులు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య గురువారం డిసిసి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్య ముసుగులో నిరంకుశ ప్రభుత్వాలను చెలాయిస్తున్న బిజెపి, బిఆర్ఎస్‌లు తోడు దొంగలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పే విధంగా తిరగబడి, తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అనే అంశాలతో 1947 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేసిందన్నారు. 2014 నుండి కేవలం రాజకీయాలతో పరిపాలన సాగించే దేశంలో రాష్ట్రంలో ఉండడం దేశ ప్రజల దురదృష్టమని వ్యాఖ్యానించారు. వ్యాపారం కోసం ఈ దేశానికి వచ్చి దేశ ప్రజలపై ఉక్కు పాదం మోపిన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఈ దేశం నుండి తరిమి వేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. నేడు మళ్ళీ ఈ దేశంలో మోడీ ప్రభుత్వం బ్రిటిష్ పరిపాలనను తలపిస్తుంటే, రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం సామంత రాజుల పరిపాలనను తలపిస్తోందని లక్ష్మయ్య ఆరోపించారు. సెంటిమెంట్ ను ఆధారంగా చేసుకొని అధికారంలోకి వచ్చి, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాలరాసి దోచుకోవడమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండబెట్టడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందుకు వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దిశా దశ ప్రకటించడానికి ఆ సేతు హిమాచలం రాహుల్ గాంధీ ప్రవేశపెట్టిన భారత్ జోడో సందేశాన్ని ప్రజల ముందు ఉంచడానికి తెలంగాణ రాష్ట్రం ఒక వేదిక కానుందని పేర్కొన్నారు. కేవలం రాజకీయ చతురత, సొంత లాభం అవకాశవాదం కోసం రాజకీయాలు చేయడం తప్ప, ప్రజా అవసరాలు, ప్రాంత అవసరాలు ఏనాడు కెసిఆర్ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన ఎలాంటి బహిరంగ సభలలోను, సమావేశాలలోనూ తెలంగాణను నేనే తెచ్చానని కేసీఆర్ చెప్పుకోలేకపోతున్నారన్నారు. తెలంగాణను ఇస్తామని చెప్పిన సోనియా గాంధీ తెలంగాణను ఇచ్చింది తప్ప కేవలం ఇద్దరు ఎంపీలతో ఒక్క కేసీఆర్ చెప్పడం వల్ల తెలంగాణ ఎలా వస్తుందని ప్రశ్నిస్తారని కెసిఆర్ కు తెలుసని వ్యాఖ్యానించారు. దళిత ముఖ్యమంత్రి అని చెప్పి దళితుల ఓట్లు దండుకుని, 9 శాతం ఉన్న గిరిజనులకు 13 శాతం ఉన్న మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి మైనారిటీల ఓట్లు దండుకుని, డబుల్ బెడ్ రూమ్ లో ఇల్లు ఇస్తామని చెప్పి నిరుపేదల ఓట్లు దండుకుని, 3 ఎకరాల భూమి ఇస్తామని చెప్పి దళితుల ఓట్లు దండుకొని సెంటిమెంట్ రాజకీయాలతో కేసీఆర్ గద్దెనెక్కి అందరినీ మోసం చేశారని లక్ష్మయ్య ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 55 లక్షల ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది, నేడు ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదు అనే వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. నరేంద్ర మోడీ, కెసిఆర్‌లు ఎన్నికల ముసాయిదాలో ఉన్న అంశాలను పూర్తి చేశామని గర్వంగా చెప్పుకునే దమ్ము ఉంటే బహిరంగ చర్చకు రావాలి. కృష్ణాజలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని తప్పుడు సమాచారంతో ముక్కు నేలకు రాసే పరిస్థితుల్లో అడ్డంగా దొరికిపోయిన చరిత్ర కెసిఆర్ దని వ్యాఖ్యానించారు. అందుకే నేడు ప్రజలు వీరిద్దరిపై తిరగబడదాం, తరిమి కొడదాం అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీతో ప్రజలతో మమేకమై ముందుకు సాగుతోందన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్వాయి పాపన్న, సమ్మక్క సారలమ్మ కాలం నుండి తెలంగాణలోని ప్రతి జీవిలో, ప్రతి మనిషిలో అనువనువునా పోరాట పటిమ దాగి ఉందని, నిరంకుశత్వానికి, అన్యాయానికి ఎదురు నిలబడి పోరాడిన ఘనత తెలంగాణ ప్రాంతానిదన్నారు. అందుకే ఈనెల 17న హైదరాబాద్ తుక్కుగూడలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు బూత్ స్థాయి నుండి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని, బిజెపి, బిఆర్ఎస్ నిరంకుశ ప్రభుత్వాలను అంతమొందించడానికి ప్రజలు అడుగు ముందుకు వేయాలని పొన్నాల విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుప్రభాత రావు, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, రేగులపాటి రమ్యారావు, కొత్త జైపాల్ రెడ్డి, మల్యాల సుజిత్ కుమార్, ఎండి.తాజ్, పులి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి ప్రశాంతవాతావరణంలో నిర్వహించుకోవాలి

**మండపాల నిర్వహకులు పోలీస్‌శాఖ అనుమతి తప్పనిసరి...**

**సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా**

**మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరిపితే కఠిన చర్యలు**

**పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్**



పెద్దపల్లి,¯ ెప్టెంబర్ 14(మనం ప్రతినిధి): గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శాభాయాత్ర, మిలాద్ ఉన్‌నబి పండుగలను ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ అన్నారు. రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరీ ఆదేశాల మేరకు గురువారం అన్ని కులాల మత పెద్దలతో జిల్లా కేంద్రంలోని మూన్ పంక్షన్‌హాల్లో పెద్దపల్లి జోన్ పోలీస్‌శాఖ నిర్వహించిన శాంతి కమిటీ పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్బంగా డీసీపీ వైభవ్ గైక్వాడ్ మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్ ఉన్ నబి వేడుకలను హిందూ, ముస్లీంలు ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని అన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టె వ్యాఖ్యాలు ఎవరు చేసినా, సోషల్ మీడియాలో పుకార్లు సృష్టించిన, అసత్య ప్రచారసందేశాలు పంపినాకఠిన చర్యలు తప్పవని, సోషల్ మీడియాపై ప్రత్యేకంగా నిఘా ఉంటుందని హెచ్చరించారు. వినాయక మండపాల నిర్వహకులు కచ్చితంగా పోలీస్‌శాఖ అనుమతి పొందాలని సూచించారు. గణేష్ విగ్రహాన్ని ప్రతిష్టించే ప్రతి గణేష్ మండలి వారు విధిగా పోలీస్‌శాఖ నుండి ముందుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి అనుమతి తీసుకోవాలని, అనుమతి కొరకు దరఖాస్తు చేయునపుడు, విగ్రహం ఎత్తు, విగ్రాహాన్ని ప్రతిష్టించే తేది, నిమజ్జనం తేది మరియు మండలి యొక్క ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ల వివరాలు సమర్పించాలని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్దలతో, ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా ప్రశాంతయుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. రాత్రి సమయంలో తనిఖీ చేయడానికి పెట్రోలింగ్‌కు వచ్చే పోలీస్ అధికారులతో మండపాల వద్ద ఉండే వాల్లంటరీలు అడిగిన సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసులకు సహకరించాలన్నారు. మండపాల వద్ద మత్తు పదార్థాలు సేవించడం, జూదం ఆడటం, ఇతర సాంఘీక కార్యక్రమాలు చేయకూడదని, అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలాంటి ఇబ్బంది ఏర్పడినా, ఏదైనా విషయం, సమాచారం ఉన్నా డయల్ 100ద్వారా లేదా సంబందిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా, నిభందనలు అతిక్రమించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని డిసిపి హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, సీఐలు అనిల్‌కుమార్, జగదీష్, సత్యనారాయణ, చంద్రశేఖర్, ప్రమోద్‌రావు,ప్రసాద్, ఎస్సైలు మహేందర్, మల్లేష్, మండపాల నిర్వహకులు, శాంతి కమిటి సభ్యులు పాల్గొన్నారు.

### జమిలీ కాకపోతే...

## కరీంనగర్ అసెంబ్లీ బరిలో దిగుతా

మొదటి పేజీ తరువాయి..

ఏరులై పారిస్తూ యువతను చిత్తు చేస్తున్నా పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ నేతలే గంజాయిని ఏరులై పారిస్తూ అడ్డగోలుగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు గంజాయిని కంట్రోల్ చేస్తారా? లేదా? ... లేనిపక్షంలో తామే యువకులతో దళాలను ఏర్పాటు చేసి గంజాయి అమ్మేటోళ్లను తరిమించమంటారా..? అని సవాల్ విసిరారు. తనతో సహా బీజేపీ నేతలంతా దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తామని, గంజాయి అమ్మకాల్లో ఏ పార్టీ నాయకులున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. అధికార పార్టీ నేతలు పైసలతో నాయకులను, ఓట్లను కొంటున్నారని, పైసలకు తాత్కాలికంగా అమ్ముడు పోయిన వాళ్లంతా త్వరలోనే వాస్తవాలు తెలుసుకుని, తిరిగి తమతోనే రావడం ఖాయమని జోస్యం చెప్పారు.

**చంద్రబాబు అరెస్టు సరికాదు..**

చంద్రబాబు నాయుడు తప్పు చేస్తే ఆయనపై చర్యలు తీసుకుంటే ఎవరికీ అభ్యంతరం లేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని బండి వ్యాఖ్యానించారు. అయితే ఎఫ్ఐఆర్ లో పేరు లేకపోయినప్పటికీ ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిని, ప్రతిపక్ష నేతగా ఉన్న నాయకుడిని అర్ధరాత్రి అరెస్ట్ చేయడం సరికాదని, కక్ష పూరితంగా అరెస్ట్ చేశారనే విషయం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. చంద్రబాబును ఆదరాబాదరాగా అరెస్ట్ చేయడంతో టీడీపీ ఇమేజ్ పెరిగిందని, పార్టీలతో సంబంధం లేని ప్రజలు కూడా చంద్రబాబు అరెస్ట్‌ను తప్పు పడుతున్నారన్నారు. వాస్తవాలు మాట్లాడితే తమను చంద్రబాబు ఏజెంట్ గానో, పవన్ ఏజెంట్ గానో ప్రచారం చేయడం వైఎస్సార్సీపీ నేతలకు అలవాటైందని, ఇది సరైంది కాదన్నారు. యావత్ ప్రపంచం జీ 20 సదస్సు గురించి చర్చిస్తుంటే అదే రోజు చంద్రబాబు అరెస్ట్ చేయడంవల్ల మీడియాను డైవర్ట్ చేసే కుట్రలు పన్ని తెలుగు ప్రజలు జీ 20 సదస్సును చూడకుండా చేశారన్నారు.

## 19 లోగా ఓటర్ల నమోదు పూర్తి చేయాలి

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): జిల్లాలో సెప్టెంబర్ 19వ తేదీ లోగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేయాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి తహసిల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి ఓటర్ల నమోదు, సవరణలు తదితర అంశాలపై అదనపు కలెక్టర్లతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్ లకు దిశానిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తుది ఓటరు జాబితా రూపొందిచడంలో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరిని ఓటర్లుగా నమోదు చేయడానికి స్పెషల్ క్యాంపెయిన్ లను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం వారిగా 18 సంవత్సరాలు పైబడిన వారందరు ఓటర్లుగా గుర్తించబడాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా ప్రస్తుత జాబితాను సరిచూసుకుని గ్యాప్ లేకుండా చూడాలన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో 20 కన్నా తక్కువ నుండి సున్నా వరకు 18 సంవత్సరాలు పైబడిన నూతన ఓటర్లు ఉన్నట్లుగా గుర్తించినట్లు, ఆ పోలింగ్ కేంద్రాలకు చెందిన ఈఆర్ఓ లు, ఏఈఆర్ఓలు సమీక్షించుకోవాలని తెలిపారు. డోర్ టు డోర్ సర్వే ద్వారా బిఎల్ఓలు ఓటర్ల వివరాలను సరిచూసుకోవాలని, జాబితాలో లేని వారినుండి ఫామ్–6 ద్వారా నమోదు చేయాలని తెలిపారు. స్పెషల్ క్యాంపెయిన్ ద్వారా వచ్చిన ఫామ్ 6,7, 8 ల ఫిజికల్ కాపీలను బిఎల్ఓలు తహసీల్దార్‌లకు అప్పగించాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో 2020 నాటికి పదవ తరగతి పూర్తిచేసుకున్న వారి జాబితా ఆధారంగా పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న నూతన ఓటర్ల వివరాలను సరిచూసుకోవాలని, చదువుకోవడానికి వేరే ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను సైతం ఫామ్–6 ద్వారా నమోదు చేయాలన్నారు. అదే విధంగా జిల్లాలో మహిళలు, పురుషుల ఓటర్ల వివరాలను కూడా సరిచూసుకోవాలని, వికలాంగుల పెన్షన్ పొందుతున్న వారి జాబితా ఆధారంగ పోలింగ్ కేంద్రం పరిదిలో ఓటర్లుగా నమోదై ఉన్న వారందరికి ఆయా పోలింగ్ కేంద్రాలలో అవసరమైన చర్యలు చేపట్టాలని, అదే విధంగా జాబితాలో లేని వారిని ఫామ్–6 ద్వారా ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 19 లోగా అర్హులైన వారందరు ఓటరు జాబితాలో ఉండాలని, ఎటువంటి పోరపాట్లకు ఆస్కారం లేకుండా ఉండే ఖచ్చితమైన తుది ఓటరు జాబితాను రూపొందించడంలో నిబద్ధతతో విధులు నిర్వహించాలని, అలస్యత్వం వహిస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లయితే వారందరిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, జాబితాలో ఫొటో, పేరు, చిరునామ ఇతర వివరాల సవరణ, బదిలి కొరకు వచ్చిన ప్రతి ఫారములను ఏరోజుకారోజు చర్యలు తీసుకోబడాలని, అదే విధంగా డాటా ఎంట్రి కూడా వెంటనే జరగాలని సూచించారు. దరఖాస్తుల్లో ఎటువంటి పెండింగ్ లేకుండా సెప్టెంబర్ 19 లోగా వచ్చిన ప్రతి దరఖాస్తు డాటా ఎంట్రి పూర్తికావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఇంచార్జ్ డిఆర్ఓ పవన్ కుమార్, కలక్టరేట్ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్న కోటలో గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇవ్వొద్దు

## గౌడ సంఘం మండల అధ్యక్షులు తిరుపతి గౌడ్

చిగురుమామిడి, సెప్టెంబర్ 14 (మనం న్యూస్)ః సైదాపూర్ మండలం సర్వాయిపేట గ్రామంలోని బహుజనల వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న కోటలో గ్రానైట్ క్వారీల నిర్వహణకు అనుమతులు ఇవ్వద్దని చిగురుమామిడి మండల గౌడ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి తిరుపతి గౌడ్ డిమాండ్ చేశారు. చారిత్రాత్మకమైన కోటను క్వారీలకు కేటాయించిన పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం సాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సర్దార్ సర్వాయి పాపన్న గుట్టలు, నక్కల బండ, బుస నాగట్లు, సర్వాయి పాపాన్న చెరువు, సర్వాయి పాపన్న కోట గడులు, బయ్యన్న గుడి, అయ్యప్ప స్వామి ఆలయ ఆనవాళ్లు ఇప్పటికీ ఉన్నాయన్నారు. ఇంతటి ప్రకృతి కరమైన ఈ పెద్ద గట్ల ప్రాంతంలో ఎలాంటి క్వారీలకు అనుతినిచ్చినా చారిత్రాత్మక ప్రదేశాలు కనుమరుగవుతాయన్నారు. గ్రానైట్ క్వారీల నిర్వహణకు అనుమతినివ్వకుండా, సర్వాయిపేట కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బుర్ర తిరుపతి గౌడ్, యువజన విభాగం మండల అధ్యక్షులు ముంజ ప్రకాష్ గౌడ్, గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు బండారుపల్లి చంద్రం గౌడ్ కోశాధికారి బండారుపల్లి రాజు గౌడ్ గౌడ సంఘం నాయకులు బూరుగు రాజయ్య గౌడ్



తాళ్లపల్లి రాములు గౌడ్ తాళ్లపల్లి భాస్కర్ గౌడ్ పచ్చిమట్ల రాజ్ కుమార్ గౌడ్ బుర్ర సమ్మయ్య గౌడ్ కక్కర్ల తిరుపతి గౌడ్ బండారుపల్లి రాయమల్లు గౌడ్ బండారుపల్లి అంతయ్య గౌడ్ బుర్ర కనకయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి

### కవ్వంపల్లి సత్యనారాయణ



శంకరపట్నం, సెప్టెంబర్ 14( మనం న్యూస్): ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి ప్రజలతోనే అందుబాటులో ఉండి అభివృద్ధి ప్రజల సమస్యలు తీరుస్తా నని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. అలాగే ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలు తీరుస్తానని తెలిపారు.పల్లె పల్లెకు కవ్వంపల్లి - గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో గురువారం పాదయాత్ర చేసిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపగోని బసవయ్య గౌడ్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ ఉత్సవాలకు తరలిరండి

### విశ్వబ్రాహ్మణ సంఘం



తిమ్మాపూర్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): కరీంనగర్ కమాన్ చౌరస్తాలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 15 నుండి 17వ తేదీ వరకు జరుగనున్న విశ్వకర్మ బ్రహ్మోత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని రామక్రిష్ణకాలనీ విశ్వబ్రా హ్మణ సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం మండలంలోని రామక్రిష్ణకాలనీ లో జరిగిన సమావేశంలో ఉత్సవ కరపత్రాలను పంపిణి చేసారు. ఈ సందర్భంగా మండలంలోని విశ్వబ్రాహ్మణ కులస్తులు కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజులు జరిగే పూజల్లో పాల్గొనాలని కోరారు. కులాబాంధవులే కాకుండా సర్వ మానవాళి శ్రేయస్సు కోరే భగవంతుని బ్రహ్మోత్సవాలకు ప్రజలను కూడా పిలవాలని కోరారు. ఈ కార్యక్రమం లో గ్రామ ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్ రెడ్డి, సంఘం అధ్యక్షులు పాలోజు నాగభూష ణం, ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు పెద్ద శ్రీనివాస్, ఎదులాపురం రవీంద్రాచారి, వేములవాడ నర్సింహ చారి, సుగుర్తి బ్రహ్మచారి, తెలుకుంట్ల రాము, శ్రీరామో జు కమలాకర్, పెందోట అనంతచారి,కర్ణకంటి శ్రీనివాస్, వేములవాడ శ్రీనివాస్, అలవాల రాజయ్య, తదితరులు పాల్గొన్నా రు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి



రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గద్దెరాగడి ప్రాంతంలో మంచిర్యాల-మందమర్రి జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. ప్లైవుడ్ షాపు ఎదురుగా పడి ఉన్న వృద్ధున్ని గమనించిన షాపు యజమాని డయల్ 100,108 అంబులెన్స్ ఫోన్ చేసి చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాదాపు 60 నుండి 70 ఏళ్ల వయసున్న వృద్ధుడు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రస్తుతం మృతదేహం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. వ్యక్తి ఆచూకీ తెలిసినవారు రామకృష్ణాపూర్ పట్టణ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని ఎస్సై జి.రాజశేఖర్ తెలిపారు.



## వినాయక మండప నిర్వాహకులు నిబంధనలు పాటించాలి : సిఐ కృష్ణ

లక్షెట్టిపేట్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని సిఐ ఆర్.కృష్ణ సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో మండలంలోని వినాయక మండపాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల నిర్వహణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డిజె లకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదన్నారు. కమిటీ సభ్యులు మండపాల వద్ద ప్రతిరోజు ఇద్దరైన అందుబాటులో ఉండాలని, మండపాల నిర్వాహకుల వివరాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని దాని ప్రింట్ మండపంలో ఉంచాలన్నారు. మద్యం సేవించడం, జూదం ఆడటం లాంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం పోలీస్ సిబ్బంది పర్యవేక్షణ చేస్తారని వివరించారు. శోభయాత్రలో అధికారులు చెప్పిన చోటనే నిమజ్జనం చేయాలని, నిమజ్జనంలో మద్యం సేవించకూడదని, డిజెలు పెట్టకూడదని, పాఠశాలలు కార్యాలయాలు ఉన్న చోట వాళ్ళ విధులకు ఆటంకం కలుగకుంగా సౌండ్ తగ్గించి పెట్టుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదం జరగకుండా ఇసుక బకెట్స్, ఫైర్ కంట్రోల్, నీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గణేష్ మండప నిర్వహణ సమయంలో, వినాయక నిమజ్జన సమయంలో పోలీసు వారికి సహకరించి పండుగ సమయంలో ఏలాంటి గొడవలకు వెళ్లకుండా ఉండాలని హెచ్చరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐ లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

### బిఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీ నరసింహ రావు



వేములవాడ టౌన్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): సిరిసిల్లలో శుక్రవారం జరుగనున్న వైద్య కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, నియోజకవర్గంలోని ఇతర ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహ రావు మాట్లాడుతూ తెలంగాణ రాకముందు రాష్ట్రంలో 5 మెడికల్ కళాశాలలు, 850 సీట్లు ఉంటే రాష్ట్రం సాధించుకున్న పదేళ్ళలో 27 కొత్త మెడికల్ కళాశాలలు కేంద్ర ప్రభుత్వ ఈఎస్ఐ ఆసుపత్రి, ఇతర రాష్ట్రాల వారి సీట్లతో కలిపి మొత్తం 3వేల840 సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లకుండా రాష్ట్రంలోని గడపగడపకు ఒక డాక్టర్ తయారయ్యే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనుమతిచ్చిన మెడికల్ కళాశాలల్లో 43శాతం తెలంగాణ రాష్ట్రానివే కావడం గర్వ కారణం అన్నారు. ప్రయివేటు కళాశాలల్లోను 85శాతం కన్వీనర్ కోటా సీట్లు తెలంగాణ రాష్ట విద్యార్థులకే కేటాయించడం సువర్ణ ఆవకాశమని పేర్కొన్నారు.

## స్వచ్ఛ్ సర్వేక్షన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మేయర్



కరీంనగర్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్)ః గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్టే ఆఫ్ అర్బన్ మెంట్ ఆద్వర్యంలో స్వచ్చత సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇండియా స్వచ్చత లీగ్ 20 కార్యక్రమాన్ని ఈ నెల 17 వ తేదీన నిర్వహించేందుకు పిలుపు నిచ్చింది. రాష్ట్రంలో నగరపాలక సంస్థ లు, మున్సిపాలిటీలు, పురపాలక సంస్థల్లో బీచ్ లు, జలాశయాలు, టెంపుల్స్, పార్కులు, బస్టాండ్ లాంటి తదితర ప్రాంతాల్లో చెత్తను తొలగించే కార్యక్రమానికి ఆహ్వానం పలుకుతూ... ఈ రోజు కరీంనగర్ భగత్ నగర్ మేయర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రత్యేక పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్స్, కాలేజీల విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను, వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళ సంఘాలు బాగస్వాములై నగరంలో స్వచ్చత కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ స్వామీ, సానిటేషన్ సూపర్ వైజర్ రాజమనోహర్, బీఆర్ఎస్ కార్యకర్తలు కన్నం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# నిర్ధేశించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలి

## మంచిర్యాల కలెక్టర్ సంతోష్




మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వితర్‌ఓ, విఆర్‌ఏల క్రమబద్ధీకరణలో భాగంగా మున్సిపాలిటీలకు కేటాయించిన వార్డు అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి.రాహుల్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఉద్యోగుల క్రమబద్ధీకరణలో మున్సిపాలిటీలలో నూతనంగా నియమితులైన వార్డు అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వార్డు అధికారులు మున్సిపాలిటీల నిర్వహణలో అత్యంత కీలకమైన పాత్ర నిర్వర్తిస్తారని, నూతనంగా నియమితులైన వార్డు అధికారులకు మున్సిపల్ కమీషనర్లు విధి నిర్వహణలో అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ వారు విధులు సక్రమంగా నిర్వహించేలా పర్యవేక్షించాలని తెలిపారు. జనన, మరణ ధృవీకరణ పత్రాలు, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, త్రాగునీటి సరఫరా, హరితహారం, గృహలక్ష్మి, పారిశుద్ధ్యం, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ తదితర అన్ని అభివృద్ధి పనులను ఎలాంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. శిక్షణలో భాగంగా లాగ్ బుక్ నిర్వహణ, టెండర్ల ప్రచురణ, గుత్తేదారుల చెల్లింపులు, ఇంజనీరింగ్, రెవెన్యూ, పారిశుద్ధ్య, మెప్మా, అకౌంట్ విభాగాల విధులను నిర్వహించాలని, ఇందులో భాగంగా వార్డు అధికారులు తమకు కేటాయించిన వార్డు హద్దులను గుర్తించి జరుగుతున్న నిర్మాణ పనులు, మొబైల్ టవర్లు, ప్రకటనల బోర్డులు ఇతర అంశాలపై ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తూ, అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన ఇండ్లకు నంబర్ల కేటాయింపు, మ్యుటేషన్లు, మార్కెట్, థాయ్ బజార్ ల వేలం, పన్నుల వసూలు తదితర అంశాలపై అధికారుల సూచనల మేరకు పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా పొలాల అమావాస్య

సిర్పూర్(టి), సెప్టెంబర్ 14 (మనం న్యూస్): శ్రావణ మాసంలోని చివరి రోజైన అమావాస్యను పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రజలు పొలాల అమావాస్య పర్వదినాన్నిభక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశువులను వివిధ రకాల రంగులతో అలంకరించి గ్రామగ్రామాన ఊరేగింపు జరిపారు.

## మేనేని రోహిత్ రావుకు తృటిలో తప్పిన ప్రమాదం



కొత్తపల్లి, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నియోజకవర్గ నాయకులు మేనేని రోహిత్ రావు ప్రయాణిస్తోన్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. హైదరాబాద్ లోని గాంధీభవన్ లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చార్జిషీట్‌పై టిపిసిసి నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పాల్గొని కరీంనగర్‌కు తిరుగు ప్రయాణం అవుతుండగా ప్రమాదం సంభవించింది. మార్గమధ్యంలో తూంకుంటలో రోహిత్ రావు ప్రయాణిస్తోన్న వాహనం ఎదురుగా వస్తోన్న ఆవు ఢీ కొట్టింది. దీంతో వాహనం ముందు భాగం ధ్వంసమై, రోహిత్ రావుకు స్వల్ప గాయాలయ్యాయి.

## బిఆర్‌ఎస్‌ను వీడిన ఆరెపల్లి మోహన్



కరీంనగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీ చైర్మన్ ఆరెపల్లి మోహన్ భారతీయ రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు కరీంనగర్ ప్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ 2019లో బిఆర్‌ఎస్ పార్టీలో చేరిన తాను అధిష్టానం చెప్పిన ప్రతి బాధ్యతను నెరవేర్చానన్నారు. హుజురాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో, కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశానన్నారు. అధిష్టానం చెప్పిన పనిని విధేయతతో నెరవేర్చానని, అయితే మానకొండూరు ఎమ్మెల్యే వ్యవహారశైలి సరిగా లేదని, ఆయన తీరుపై తాను పలుమార్లు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు మోహన్ వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బిఆర్‌ఎస్ పార్టీలో పనిచేసే పరిస్థితులు లేనందున తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల ఆరెపల్లి మోహన్ అనుచరులతో సమాలోచనలు జరిపి పార్టీని వీడేందుకు మొగ్గు చూపారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణారావులు చర్చలు జరపడంతో వెనక్కి తగ్గారు. ఈ మేరకు ఆరెపల్లి మోహన్ పార్టీలోనే కొనసాగుతారని జివి ప్రకటన కూడా విడుదల చేశారు. దీంతో ఆరెపల్లి మోహన్ పార్టీలోనే కొనసాగుతారని భావించినప్పటికీ, అనూహ్యంగా ఆయన రాజీనామా చేయడం సంచలనంగా మారింది.

## ఘనంగా హిందీ దివాస్ వేడుకలు




లక్షెట్టిపేట్, సెప్టెంబర్ 14(మనం న్యూస్): పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో గురువారం హిందీ విభాగ్ ఆధ్వర్యంలో జాతీయ భాష హిందీ దివాస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ హిందీ భాష అందరూ నేర్చుకోవాలని, దేశంలో ఎక్కడికి వెళ్లిన కూడా హిందీలోనే ఎక్కువగా మాట్లాడుతారన్నారు. దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఉద్యోగ రీత్యా రాణించాలంటే హిందీ తప్పనిసరిగా వచ్చి ఉండాలన్నారు.హిందీ మంచి భాష అని హిందీలో ఎన్నో ప్రముఖ గ్రంథాలు, సాహిత్యాలు వెల్లివిరిశాయని వివరించారు. అంతకుముందు హిందీ విభాగం అధ్యాపకులు డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ హిందీ దేశ అధికార భాష అని, ప్రతి భారతీయుడు హిందీ భాషలో తమ భావ వ్యక్తీకరణ చేయడం ఎంతో అవసరమన్నారు. తులసీదాస్ రచించిన రామాచరితమానస్ భారతీయ ఔనత్యాన్ని చాటిందని గుర్తు చేశారు. ప్రతి రోజు కనీసం ఒక హిందీ పదం నేర్చుకుంటే సులభంగా భాష వస్తుందన్నారు. అంతకుముందు పలువురు విద్యార్థులు హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కవితలు, పద్యాలు, పాటలు పాడారు. పలువురు అధ్యాపకులు హిందీ భాష ప్రాముఖ్యతను తమ అనుభవాలతో వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగయ్య,అధ్యాపకులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్, సంధ్య రాణి, శ్రీనివాస్ ,రాం చంద్రం,రాజ్ కుమార్,సౌమ్య, అపూర్వ, అరుణ, కుమార్, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణకార మహా గర్జన విజయవంతం చేయాలి

### స్వర్ణకార సంఘం అధ్యక్షులు వెంకటస్వామి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): హైదరాబాదులో అక్టోబర్‌లో జరగబోయే స్వర్ణకార మహా గర్జనకు రాజన్న సిరిసిల్ల జిల్లా స్వర్ణకారులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిరిసిల్ల స్వర్ణకార సంఘం అధ్యక్షులు చెన్నోజు వెంకటస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించుకునే విధంగా అందరూ ఏకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రెగ్గలం గోపి, కోశాధికారి నారోజు బాలయ్య, ఉపాధ్యక్షులు పాలకొండ సత్యం, శిలుముల మధు, చిలుముల భాస్కర్, సంతోష్ తదితర స్వర్ణకారులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులకు, వికలాంగులకు ఆరోగ్య శిబిరం




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండపల్లి గ్రామంలో వయోవృద్ధులకు, వికలాంగులకు మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా గురువారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ శివ జ్యోతి, ఎంపిటిసి సభ్యులు బుస్సా స్వప్న లింగంతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ సభ్యులు చైర్మన్ కేశవ రెడ్డి సహకారంతో డాక్టర్ ఎం ఎల్ ఎన్ రెడ్డి సారధ్యంలో కరీంనగర్ వైద్య బృందం ఆరోగ్య శిబిరం వైద్య పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో స్థానిక ఏఎన్ఎంలు సంతోషి, లావణ్య, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ చైర్మన్ గుడ్ల రవి, ట్రెజరర్ బుడిమే శివ ప్రసాద్, కార్యదర్శి శివప్రసాద్ సభ్యులు విరామచంద్రరావు, మంతెన సతీష్, రాచకొండ మహేష్ గుడ్ల సునీల్, కూనబోయిన వేణు, ఆనందం రాపల్లి, ప్రయకరావు, వేణు కుమార్ లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

## డిసిసి అధ్యక్షులు ఆది శ్రీనివాస్

## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 14, (మనం న్యూస్): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణం లక్ష్మీపురం పెద్దమ్మల కాలనీ చెందిన 100 మంది యువకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా వారికి ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులు తప్ప తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఎవరికి ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో కేసీఆర్ కుటుంబానికి తప్ప ఎవరికి న్యాయం జరగలేదని శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన తర్వాత ప్రతి ఒక్క పేదవాడిని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకుపోతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం, పెద్దమ్మల కాలనీకి నరసయ్య,



రాజయ్య, శంకర్, సమ్మయ్య, పోచయ్య, నరసయ్య, పెద్ద నరసయ్య, తదితరులు ఉన్నారు కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక రమేష్ కూరగాయల కొమరయ్య సూగురి లక్ష్మీ నాగభూషణం, తోట లహరి, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కనికరపు రాకేష్, శంకర్ ,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## మట్టి గణపతి పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

కరీంనగర్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్)ః భరోసా స్వచ్చంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అని ముద్రించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ డాక్టర్ బి.గోపి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి గణపతి పూజించి, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నందుకు భరోసా సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్చంధ సంస్థ అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు, నాయకులు కంకటి అనూప్, మల్యాల వేణుగోపాల్, జంజీరాల వేణు, పాత శ్రీనివాస్, సిరిపురం మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

మెట్ పల్లి, సెప్టెంబర్ 14 (మనం న్యూస్)ః బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బిజెపి పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పాత బస్టాండ్ శాస్త్రి విగ్రహం వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి, కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సాంబారి ప్రభాకర్, కోరుట్ల నియోజ కవర్గ నాయకురాలు జెఎన్.సునీత, కోరుట్ల నియోజకవర్గ నాయకులు ఆకుల లింగారెడ్డి. పార్లమెంటు కో-కన్వీనర్ గుంటుక సదాశివం, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు, బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికేలా నవీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంప శ్రీనివాస్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సుంకెట విజయ్, బొడ్ల నరేష్, రమేష్ యాదవ్ బీజేవైఎం పట్టణ అధ్యక్షులు ఆర్మూర్ రంజిత్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శులు కుడుకల రఘు, శ్రీరామ్ శివ, కలికోట శ్రీకాంత్ ,భీమ్నాథ్ విజయ్, బిజెపి పట్టణ ఉపాధ్యక్షురాలు మద్దెల లావణ్య, మహిళా మోర్చా అధ్యక్షురాలు పుల్ల సౌజన్య, వరలక్ష్మి,



సునీత, బిజెపి పట్టణ కార్యదర్శి జుంగుల అనిల్ గౌడ్, నాయకులు శ్రీనివాస్, జగన్, పట్టణ ఉపాధ్యక్షులు బొడ్ల నాగేష్, నాయకులు క్రాంతి, ఆనంద్, గంగాధర్, లోలపు అనిల్, ముద్రకోల రాజ్ కుమార్, శ్రీకాంత్, తిరుమల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



మంచిర్యాల, సెప్టెంబర్ 14 ( మనం న్యూస్ ) : స్థానిక వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఐబి చౌరస్తాలో అమావాస్య అన్న ప్రసాద వితరణ పేరిట అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద దాతలు గుంత వైకుంఠం సౌభాగ్య, గుంత సుమన్ రాధిక, గుంత సాయినాథ్ లక్ష్మి ప్రసన్న, క్లబ్ అధ్యక్షుడు నలుమాస్ ప్రవీణ్ కుమార్, కార్యదర్శి ఎర్రం వెంకటేష్, కోశాధికారి చిలువేరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ జన్మభూమి నుండి శ్రీలంక వరకు శ్రీరామభక్తుని పాదయాత్ర



జమ్మికుంట, సెప్టెంబర్ 14 (మనం న్యూస్)ః శ్రీరామ జన్మభూమి నుండి శ్రీలంక వరకు ఓ శ్రీరామ భక్తుడు పాదయాత్ర చేపట్టారు. అఖండ భారతావనిలో శ్రీరాముడు వనవాసం చేస్తూ సంచరించిన ప్రాంతాల మీదుగా ఆయన తన పాదయాత్రను కొనసాగిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్ లోని అయోధ్యకు చెందిన సబిందర్ సింగ్ అనే శ్రీరామ భక్తి కలిగిన యువకుడు అయోధ్య నుండి తన పాదయాత్రను మొదలుపెట్టారు. ఇప్పటివరకు ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్ ఘడ్, జార్ఖండ్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ మీదుగా పాదయాత్ర కొనసాగిస్తూ తెలంగాణ రాష్ట్రానికి చేరుకున్నారు. ఆయన తెలంగాణ రాష్ట్రం నుండి పాదయాత్ర కొనసాగిస్తూ మహారాష్ట్రకు వెళ్లనున్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మీదుగా పాదయాత్ర కొనసాగిస్తూ జమ్మికుంట సమీపంలోని ఇల్లందకుంటను సందర్శించిన అనంతరం అక్కడి నుండి ఆయన పాదయాత్ర కొనసాగిస్తూ జమ్మికుంటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీరాముడు వనవాసం చేస్తూ ఏ ఏ ప్రాంతాల్లో పర్యటించారో ఆ ప్రాంతాల మీదుగా తన పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. అయోధ్య నగరం నుండి శ్రీరాముడు వనవాసం చేస్తూ అఖండ భారతదేశం అంతటా పర్యటించిన ప్రాంతాలతో పాటు సీతమ్మను ఎత్తుకెళ్లడంతో ఆమె చెర విడిపించేందుకు శ్రీరాముడు శ్రీలంకకు వెళ్లారని తెలిపారు. సబిందర్ సింగ్ కూడా శ్రీలంక వరకు తన పాదయాత్రను కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. శ్రీలంక వరకు పాదయాత్ర చేసి తన యాత్రను ముగిస్తానని ఆయన తెలిపారు.



## టెట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు

కొమురం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్)ః జిల్లాలో నిర్వహించబోతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించిన కాగజ్ నగర్, ఆసిఫాబాద్ పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు, రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ రవికాంత్ రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులను, సీటింగ్ విధానాన్ని పరిశీలించారు. ఆ పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ , డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా సమయాని కంటే ముందే పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ వాచ్‌లు, మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రానికి తీసుకురావద్దని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం



మానకొండూర్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్)ః బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బిజెపి మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి, ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇంచార్జి గడ్డం నాగరాజు, గీత కార్మికుల సెల్ జిల్లా కన్వీనర్ పూదరి రమణా గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మియాపురం లక్ష్మణచారి, మండల ప్రధాన కార్యదర్శులు సొన్నాకుల శ్రీనివాస్, వంగళ ఆంజనేయులు, ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శి మొగిలి శ్రీనివాస్, బొమ్మరవేని మల్లన్న, బిజెవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కాల్వ చిరంజీవి, మండల ఉపాధ్యక్షులు కత్తి ప్రభాకర్ గౌడ్, కంది రాజిరెడ్డి కార్యదర్శులు కనుకుంట్ల ఆంజనేయులు, చొప్పరి అశోక్, నాయకులు భాషబోయిన ప్రదీప్ యాదవ్, ఆరెల్లి శ్రీహరి, ఎదులాపురం అశ్వన్ తేజ, బల్ల అంజి ముదిరాజ్, పిట్టల నరేష్ పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు భృతి చెల్లించే వరకు

# బిజెపి పోరాటం ఆగదు

### బిజెపి జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి



మంచిర్యాల, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గత 5 సంవత్సరాల నుంచి పెండింగ్ లో ఉన్న నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని మంచిర్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ గురువారం పట్టణంలోని ఐబి చౌరస్తాలో బిజెపి యువ మోర్చా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి చెల్లించకుండా, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ నిరుద్యోగ యువతనే ఈ నిరంకుశ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నిరుద్యోగ యువత ఎవరు కూడా అధైర్య పడవద్దని, బిజెపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తుల ఆంజనేయులు, బింగి సత్యనారయణ, పట్టి వెంకటకృష్ణ, పానుగంటి మధు, గాదె శ్రీనివాస్, అనిరెడ్డి రాజు, కొండ నరేష్, రాకేష్ రెన్వా, రెడ్డుమల్ల అశోక్, గాజుల ప్రభాకర్, రవనవెని శ్రీనివాస్, బొయిని దేవేందర్, , పచ్చ వెంకటేశ్వర తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి జిల్లా అధ్యక్షుడికి ఘన స్వాగతం

సుల్తానాబాద్,సెప్టెంబర్ 14 మనం న్యూస్ : పద్మశాలి సేవ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు వేముల రామ్మూర్తి దంపతులు విదేశీ పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగి రావడంతో పద్మశాలి శ్రేణులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐల రమేష్,ఉపాధ్యక్షులు సాయిరి మహేందర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గురువారం మండల కేంద్రంలోని సుల్తానాబాద్ శాస్త్రినగర్‌లో రామ్మూర్తి దంపతులకు స్వాగతం పలికి బాణాసంచా పేల్చి బొకే శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పద్మశాలి నేతలు మాట్లాడుతూ జిల్లాలోని పద్మశాలిల ఐక్యత కోసం నిర్విరామ కృషి చేస్తూ అమెరికాలో ఉన్న పద్మశాలి శ్రేణులు అందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు కృషి చేసి రానున్న రోజుల్లో పద్మశాలీలు అందరూ ఐక్యంగా ఉండి పద్మశాలీల ఔన్నత్యాన్ని చాటి ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని అన్నారు. నిర్విరామ కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు చీకట్ల కొండయ్య,స్వతంత్ర కుమార్,గుండా మురళి,పెగడ చందు,సామల హరికృష్ణ,రాజేంద్రప్రసాద్,కొండ సత్యనారాయణ,మెరుగు వెంకటేష్,రమణ,ఎల్లె రాజు,ఆంజనేయులు,సాయిరి పద్మ,బిక్షపతి లతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పలువురు పాల్గొన్నారు.

## బదిలీలు,పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి



వీణవంక-సెప్టెంబర్14(మనం న్యూస్): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు ,పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని, వారు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిష్కరించాలని, పదోన్నతులు వద్దనుకునేవారి నుండి అంగీకారం తీసుకొని తరువాత వారికి పదోన్నతులు కల్పించాలని అన్నారు. మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని, రాష్ట్రప్రభుత్వం వెంటనే పే రివిజన్ కమీషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలు సత్యనారాయణ, రవికిరణ్, పోలాడి సత్యనారాయణరావు, ఓదెల శివకుమార్ తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### కాంట్రాక్ట్ కార్మికులకు 7వ తేదీన

# జీతాలు చెల్లించాలి

### ఏఐటియుసి బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్

నస్పూర్, సెప్టెంబర్ 14( మనం న్యూస్)సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి నెల 7వ తేదీనే జీతాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ డిమాండ్ చేశారు. గురువారం సిహెచ్ పి రైల్వే సైడింగ్ మెయింటెనెన్స్ కార్మికులతో మాట్లాడుతూ సకాలంలో జీతాలు చెల్లించేలా యాజమాన్యం కృషి చేయాలన్నారు. ప్రతి నెల ఏడవ తేదీన వేతనాలు చెల్లించాలని సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిన ఆ సర్క్యులర్‌ను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు వచ్చే అరకొర జీతాలను కూడా నెల చివరి వారంలో తప్ప ముందు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రతినెలా ఏడవ తేదీలోపు జీతాలు చెల్లించాలని అన్నారు. లేనిపక్షంలో సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేసే పోరాట కార్యక్రమాలకు యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డిపట్ల రవీందర్, బాపు, సది, సతీష్, వంశీ, ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్.సి.వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

### మాదిగా రిజర్వేషన్ పోరాట సమితి, మంచిర్యాల జిల్లా కమిటీ డిమాండ్




మంచిర్యాల ,14,సెప్టెంబర్( మనం న్యూస్): ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశం లోనే ఎస్.సి.వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని మాదిగా రిజర్వేషన్ పోరాట సమితి, మంచిర్యాల జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యం లో పట్టణంలోని ఐ.బి.వద్ద గురువారం నాడు రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాదిగా రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ ఎస్.సి.వర్గీకరణ మా హక్కు అని, ఏ.బి.సి.డి వర్గీకరణ చేయాలిసిందే అని డిమాండ్ చేసారు. ప్రస్తుతం ఈ నెల 18 నుంచి జరుగబోయే ప్రత్యేక పార్లమెంట్ సమావేశం లోనే బిజెపి ప్రభుత్వం బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదించాలని కోరారు.ఈ దీక్షలో జిల్లా ఇంచార్జి గుండా థామస్ , పతన ఇంచార్జి చిప్పకుర్తి మాదిగ, కో ఇంచార్జి గరే చంద్ర శేఖర్, ఐలయ్య,రాఘవ,లక్ష్మణ్ ,వినోద్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నం భోజన కార్మికులకు వేతనాలు పెంచాలి

### భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్



సిరిసిల్ల అర్బన్,సెప్టెంబర్14( మనంన్యూస్)మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతు తెలియజేస్తూ వారికి కనీస వేతనాలు పెంచాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో పాఠశాల విద్యార్థులకు భోజనం వండుతూ వారు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గతంలో సిఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా వెయ్యితోపాటు మరో 2000 జీతం పెంచుతున్నట్లు తెలియజేస్తూ, జీవో జారి చేసిన ఇంతవరకు ఆ జీవో అమలు కావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు .ఇప్పటికైనా ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను చేస్తున్న సమ్మెకు స్పందించి వెంటనే వారి డిమాండ్లను నెరవేర్చాలని , వారి పనికి తగ్గ వేతనం, భద్రత కల్పిస్తూ వారికి హెల్త్ కార్డులు ,కనీస వేతనం 18 వేల రూపాయలు ఉద్యోగ భద్రత ,భీమా సౌకర్యం , వంటి సదుపాయాలు కల్పించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయకులు నరేష్ , అంజయ్య ,వినోద్ ,రమేష్ శ్రీనివాస్ ,మరియు తదితరులు పాల్గొన్నారు.

## నీతి అయోగ్ ప్రతి అంశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి కె.మాణిక్ రాజ్




కొమురంభీంఆసిఫాబాద్, సెప్టెంబర్ 14(మనం న్యూస్): నీతి అయోగ్ ప్రతి అంశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి కె.మాణిక్ రాజ్ అన్నారు. నీతి అయోగ్ లో భాగంగా అభివృద్ధి పనుల కొరకు ఎంపికైన తిర్యాణి మండలంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శికి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి లు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అధికారులు,తిర్యాణి మండల అధికారులతో జిల్లాలో వైద్య రంగం, మహిళ శిశు సంక్షేమ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, గర్భిణులకు, శిశువులకు అందించే పౌష్టికాహారం, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, సదుపాయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రతి విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని 29 గ్రామపంచాయతీ లకు రోడ్డు సౌకర్యం కల్పించి మండల కేంద్రానికి అనుసంధానం చేయడం ద్వారా మరింత అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

## అచీవర్స్ పాఠశాలలో ఘనంగా హిందీ దివస్ వేడుకలు



కరీంనగర్,సెప్టంబర్14( మనంన్యూస్): కోతి రాంపూర్ లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు హిందీలో తమ భాషా నైపుణ్యాన్ని పాటలు ,నాటికల ద్వారా వ్యక్తపరిచారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హిందీ భాష యొక్క గొప్పతనాన్ని వివరించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ సి.హెచ్. పల్లవి మాట్లాడుతూ హిందీ భాష యొక్క ఆవశ్యకతను మన జాతీయ భాషగా ప్రతి ఒక్కరూ దానిని నేర్చుకొని మాట్లాడవలసిన అవసరం ఉందని మరొకసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సి.హెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి.హెచ్ .పల్లవి ,పాఠశాల సిబ్బంది విద్యార్థిని ,విద్యార్థులు అధిక సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## నాలుగవ రోజు కొనసాగిన నిరవధిక సమ్మె




మెట్ పల్లి సెప్టెంబర్ 14 ( మనం న్యూస్ ) : పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం నాలుగవ రోజు అంగన్వాడీ కార్యకర్తలు నిరవదిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రతకై తాము పోరాడుతుంటే తమ సంబంధిత శాఖ అధికారులు మాత్రం తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వాపోయారు . అనేక సంవత్సరాల నుండి వెయ్యి కనులతో ఎదురుచూస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నేటికీ పరిష్కారం చేయలేదని అన్నారు. రాష్ట్రంలో వీఆర్ఏలను, గ్రామపంచాయతీ సెక్రటరీలను, కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం పెర్మనెంట్ చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించడంలో అంగన్వాడీలు కూడా పోరాటం చేశామని గుర్తు చేశారు. అంగన్వాడి సంఘాల ఒత్తిడి మేరకు ఆగస్టు 18న స్వయంగా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, హైదరాబాదులో అంగన్వాడి సంఘాలతో జాయింట్ సమావేశం నిర్వహించారని అన్నారు. అన్ని అంశాలను చర్చించికొన్నింటి పైన నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇచ్చిన హామీలకు భిన్నంగా ఆగస్టు 25న అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను ప్రభుత్వ ప్రకటించిందని అన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో పోరాటం తప్ప మరో మార్గం లేదని సిఐటియు ఎఐటియుసి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పడి సెప్టెంబర్ 11 సోమవారం నుండి నిరవధిక సమ్మె చేయాలని కమిటీ నిర్ణయించిందన్నారు. అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనంగా 26000 ఇవ్వాలని అన్నారు. పెన్షన్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు 10 లక్షలు, హెల్పర్లకు 5 లక్షలు చెల్లించాలన్నారు. అంతేకాకుండా వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించాలన్నారు. 60 సంవత్సరాల తర్వాత అంగన్వాడి ఉద్యోగులు వాలంటరీ రిటైర్మెంట్ కోరితే రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం 5లక్షలు చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరి, ఏఐటీయూసీ అంగన్వాడి రాష్ట్ర కార్యదర్శి ఏ భాగ్యలక్ష్మి, మెట్ పల్లి అర్బన్ మాధస్తు లక్ష్మి, మాదాస్తు పద్మ, నజీమా, తిరుక్కో వేల శ్రీదేవి, విజయలక్ష్మి, సుమలత, మెట్ పల్లి రూరల్ కోలు సుమలత,దీప, మల్లాపూర్ మండల్ సంధ్యారాణి, రజిత, ఇబ్రహీంపట్నం మండల్ సమీం సుల్తానా, జి లక్ష్మి నర్సు , ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎండి ఉస్మాన్, రామిళ్ళ రాంబాబు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు శాంతియుతంగా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలి

**- సుల్తానాబాద్ సీఐ జగదీష్**

**- గనస్త్రస్ మండపాల నిర్వాహకులతో పోలీసుల సమావేశం**

**- మండపాలు ఏర్పాటుకు ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలి**



సుల్తానాబాద్,సెప్టెంబర్ 14 మనం న్యూస్ : రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఐపిఎస్ ఆదేశాల మేరకు సుల్తానాబాద్ సర్కిల్ పోలీస్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవ్ కమిటీస్,మండపం నిర్వాహకులకు అవగాహన సదస్సు గురువారం సుల్తానాబాద్ యశోద నరహరి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ జగదీష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ఎలాంటి గొడవలు లేకుండా సామరస్యం గా,శాంతియుతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని అన్నారు. పోలీసుల సూచనలు,సలహాలను పాటిస్తూ ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని కోరారు. పోలీస్ వారి సూచనలు ముందస్తు జాగ్రత్తలు వినాయక విగ్రహ ప్రతిష్ట ఏర్పాటు చేసుకోవడానికి తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి, విగ్రహాల ఎత్తు,బరువు,ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య,నిమజ్జం చేసే తేదీ,సమయం,నిమజ్జన మార్గం,విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలని అన్నారు. వినాయక చవితి పందిళ్ళ ఏర్పాటుకు పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామపోలీస్ అధికారిని మండపాల నిర్వహణ కమిటీ వారికి 24 గంటలు అందుబాటులో ఉంటారనీ,నిర్వహణ కమిటీ వారికి ఏవిధమైన సమస్య,సందేహాలు వచ్చినా పోలీస్ స్టేషన్లో గానీ,లేక డయల్ 100 సంప్రదించాలని సూచించారు. మండపాల వద్ద శబ్ద కాలుష్యం లేకుండా ఉండే విధంగా స్పీకర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లను ఎట్టి పరిస్థితులలోను ఉపయోగించ రాదనీ,అలాగే మండపాలలో దీపారాధనల వలన అగ్నిప్రమాదాలు జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలనీ,విద్యుత్ వైర్లను ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో జాగ్రతలు వహించాలని,ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలని,భద్రత కోసం రాత్రి సమయాల్లో మండపాల వద్ద విధిగా నిర్వహణ కమిటీ వారి వాలంటీర్ కాపల ఉండాలి. మండపాల వద్ద ఏ విధమైన అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు నీరు,ఇసుకను ఏర్పాటు,ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ ఎస్సై విజేందర్,కాల్వశ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్,పోత్కపల్లి ఎస్సై శ్రీధర్,జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ పాల్గొన్నారు.

# వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి వ్రాత పరీక్ష



రామగిరి,సెప్టెంబర్ 14 మనం న్యూస్ : రామగుండం-3 సింగరేణి సేవా సమితి తరపున గత ఆర్థిక సంవత్సరాం (2022-23) మహిళలకు టైలరింగ్,మగ్గం వర్కు,బ్యూటిషియన్ మొదలగు వృత్తివిద్య కోర్సులతో శిక్షణ ఇచ్చింది. రచ్చపల్లి-టైలరింగ్,కల్వచర్ల- మగ్గం వర్క్,రత్నాపూర్ - టైలరింగ్,మగ్గం వర్క్ సెంటినరీకాలనీ టైలరింగ్,బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణను దాదాపు 200 మంది మహిళలు తీసుకున్నారు వారికి ఖాదీ గ్రామోద్యోగ మహావిద్యాలయ హైదరాబాద్ వారు గురువారం సెంటినరీకాలనీ కమ్యూనిటీ హాలు నందు వాత్ర పరీక్షను నిర్వహించారు. 150 మంది మహిళలు వ్రాత పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణను పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్‌రెడ్డి,ముఖ్యఅతిథిగా హాజరై పరిశీలించారు. ఇటివ్ట పరీక్షలను ఖాదీగ్రామోద్యోగ తరపున నరేష్,సింగరేణి సేవాసమితి తరపున శివకుమార్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైపియంలు మారుతి,సునీల్,సీనియర్ పిఓ రాజేశం, జూనియర్ ఇన్స్పెక్టర్ రాజయ్య,వివిధ కోర్సులు శిక్షకులు ఆశ్విని, సుధ,భాగ్యలక్ష్మి,స్వప్న,పద్మ,ఆస్మ తదితరులు పాల్గొన్నారు.



# పద్మశాలి జిల్లా అధ్యక్షుడికి ఘన స్వాగతం

సుల్తానాబాద్,సెప్టెంబర్ 14 మనం న్యూస్ : పద్మశాలి సేవ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు వేముల రామ్మూర్తి దంపతులు విదేశీ పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగి రావడంతో పద్మశాలి శ్రేణులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐల రమేష్,ఉపాధ్యక్షులు సాయిరి మహేందర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గురువారం మండల కేంద్రంలోని సుల్తానాబాద్ శాస్త్రినగర్‌లో రామ్మూర్తి దంపతులకు స్వాగతం పలికి బాణాసంచా పేల్చి బొకే శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పద్మశాలి నేతలు మాట్లాడుతూ జిల్లాలోని పద్మశాలిల ఐక్యత కోసం నిర్విరామ కృషి చేస్తూ అమెరికాలో ఉన్న పద్మశాలి శ్రేణులు అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు కృసి చేసి రానున్న రోజుల్లో పద్మశాలీలు అందరూ ఐక్యంగా ఉండి పద్మశాలీల ఔన్నత్యాన్ని చాటి ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని అన్నారు. నిర్వారామ కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు చీకట్ల కొండయ్య,స్వతంత్ర కుమార్,గుండా మురళి,పెగడ చందు,సామల హరికృష్ణ,రాజేంద్రప్రసాద్,కొండ సత్యనారాయణ,మెరుగు వెంకటేష్,రమణ,ఎల్లె రాజు,ఆంజనేయులు,సాయిరి పద్మ,బిక్షపతి లతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పలువురు పాల్గొన్నారు.
ఫోటో నంబర్ ఎస్‌బిడి 08

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గుండెపోటుతో మృతి

**పార్థివ దేహానికి నివాళులర్పించిన అడవిశ్రీరాంపూర్ కాంగ్రెస్ నాయకులు**



ముత్తారం,సెప్టెంబర్ 14 మనం న్యూస్ : ముత్తారం మండలంలోని అడవిశ్రీ రాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారుపాక రాజమౌళి (84) బుధవారం సాయం త్రం గుండెపోటుతో మరణించగా వారి పార్థివదేహానికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి నివాళులు ఆర్పించి వారి కుటుం బానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన ముత్తారం మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ,అడవిశ్రీరాంపూర్ ఎంపిటిసి దొడ్డ గీతారాణి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చాంద్ పాషా వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,బోనగాని బల్లయ్య,వీరగోని సంతోష్,పింగిలి రవీందర్‌రెడ్డి,సట్ల మొగిలి,భోగం విజయ్,బొనగాని మొగిలి,కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సంగెం వంశీ,తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్,టిబిజికెఎస్ ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనం



రామగిరి,సెప్టెంబర్ 14 మనం న్యూస్ : బిఆర్ఎస్,టిబిజికెఎస్ ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం రాత్రి సెంటినరీకాలనీలో జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనం ఎల్లంకి రామారావు ఆధ్వర్యంలో జరగగా ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు వచ్చారు. పుట్ట మధు మాట్లాడుతూ రాబోయే ఎంఎల్ఏ ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు పోవాలనే విషయాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రామగిరి మండల ప్రెసిడెంట్ శంకేసి రవీందర్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ,రైతు సమితి అధ్యక్షులు కుమార్‌యాదవ్,టిబిజికేయస్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్,శంకరయ్య,అధిక సంఖ్యలో బిఆర్ఎస్,టిబిజికెఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కల్వచర్ల గ్రామానికి చెందిన గాయకులు ఓడితల శ్రీనివాస్,బర్ల సత్తయ్యలకు ఘన సన్మానం



రామగిరి,సెప్టెంబర్ 14 మనం న్యూస్ : పెద్దపల్లి జిల్లా యూట్యూబ్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవ సందర్భంగా పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో పెద్దపల్లి జిల్లాలోని కళాకారులను ఘనంగా సన్మానించడం జరిగింది. అందులో భాగంగా కల్వచర్ల గ్రామానికి చెందిన గాయకులు ఓడితల శ్రీనివాస్,బర్ల సత్తయ్య ని యూనియన్ పెద్దలు అందరూ కలిసి సన్మానించడం జరిగింది. వీరికి కమాన్‌పూర్ మాజీ జెడ్పిటిసి,కల్వచర్ల గ్రామసర్పంచ్ గంట పద్మా వెంకటరమణరెడ్డి అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని కలవచర్ల గ్రామానికి గొప్ప పేరు తేవాలని మనసూర్తిగా కోరుకుంటు అలాగే ప్రాచీన కళలకు నటన మీద ఆసక్తి ఉన్న వాళ్లకు కళాకారులకు మా యొక్క సహకారం ఎప్పుడు ఉంటుందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఎస్పి మంథని నియోజకవర్గ ఇన్చార్జ్ రవి,రేండ్ల కమారస్వామి,బోనాల రాజయ్య, సతీష్,బొంకూరి పోశం,సింగిడి చిత్రాలు,యూట్యూబ్ ఛానల్ ఇంచార్జ్ మేకల మారుతి పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



ముత్తారం,సెప్టెంబర్ 14 మనం న్యూస్ : ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సందరెల్లి గ్రామానికి చెందిన పెద్ది సమ్మక్క ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి,మంథని శాసనసభ్యులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని ఓబిసి సెల్ మండల అధ్యక్షులు అల కుమారస్వామి పరామర్శించి,ఆమె మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బగ్గని మొగిలి,గ్రామ యువజన శాఖ అధ్యక్షులు పందుల రాజ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ది సమ్మయ్య,పర్శ ఓదెలు ,పెద్దిలచ్చన్న ,సోమిశెట్టి నారాయణ,యేలుపుల రమేష్,కొక్కు రాజేశం,చొప్పరి సురేష్,కటకం సది,క ట్ల శేఖర్,యేటా రవీందర్,అల్లం రాజేశం,చిదార్ల కుమారస్వామి,బూడిద సుమన్,అక్కపాక సతీష్,బూడిద సతీష్, కొలిపాక శంకర్,ఇటుకల రమేష్,గుడివెనక ప్రసాద్,దొమ్మటి రాజేందర్‌లు పాల్గొన్నారు.

## వైన్‌షాపులలో చోరి




ఇల్లందకుంట-సెప్టెంబర్14(మనం న్యూస్): మండల కేంద్రంలోని శ్రీ మారుతివైన్స్, సాయి నాథ్ వైన్స్ షాపులలో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరికి పాల్పడ్డారు. పోలీస్‌స్టేషన్‌కు అత్యంత సమీపంలో ఉన్న ఈ వైన్స్‌షాపులలో దొంగలు తాళాలు పగుల గొట్టి అందులోని విలువైన మద్యం బాటిల్స్‌తో పాటు నగదును ఎత్తుకెళ్లారు. సాయినాథ్ వైన్‌షాపులో 45వేల రూపాయల నగదు, 8వేల రూపాయల విలువగల మద్యం సీసాలు, మారుతి వైన్స్ లో 95వేల రూపాయల నగదు, 5వేల రూపాయల విలువగల మద్యం సీసాలను దుండగులు దోచుకెళ్లారు. గురువారం వైన్‌షాపుల యజమానుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజకుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలపై ప్రత్యేక దృష్టి

- రానున్న ఎన్నికల్లో బిజెపి దమ్ము చూపిస్తాం
- ఎంఐఎం నాయకులతో గంగుల ములాఖత్
- ఎన్ని కుట్రలు పన్నినా ఏడు స్థానాల్లో విజయం సాధిస్తాం

బండి సంజయ్‌కుమార్



కరీంనగర్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతూ సొంత పార్లమెంటు నియోజకవర్గానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోయాయని, ఇకపై కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంపైనే ప్రత్యేక దృష్టి సారిస్తానని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి దమ్ము చూపించి, పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. గురువారం నగరంలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నేతలతో పార్టీ సంస్థాగత బలోపేతంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలాధ్యక్షులు, జిల్లా ఆఫీస్ బేరర్స్, జిల్లా ఇంఛార్జీలు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యేలు సుద్దాల దేవయ్య, బొడిగె శోభ, జిల్లా ఇంచార్జి మీసాల చంద్రయ్య, మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాపారావు, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, బొమ్మ శ్రీరాం, ఎర్రం మహేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవంతోపాటు నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలతోపాటు త్వరలో చేపట్టబోయే బస్ యాత్ర వంటి అంశాలపై చర్చించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ జమిలి ఎన్నికలొస్తాయా? అసెంబ్లీ ఎన్నికలొస్తాయా? అనే దానితో సంబంధం లేకుండా ప్రతి ఒక్క బిజెపి నాయకుడు, కార్యకర్త నిరంతరం ప్రజల్లో ఉండాలని సూచించారు. ప్రజల్లో బిఆర్ఎస్ పట్ల తీవ్రమైన వ్యతిరేకత నెలకొందని, కాంగ్రెస్ ఊసే లేదని, ఇకపై ఎవరి నియోజకవర్గంలో వాళ్లు బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి గంగుల కమలాకర్ స్థానిక ఎంఐఎం నాయకులతో కలిసి అసదుదీన్ ఓవైసితో ములాఖత్ అయ్యారని, ఇలాంటి వారినేనా గెలిపించేదని ప్రజలంతా ఆలోచన చేయాలని సంజయ్ వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ పార్టీ ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో బిజెపి అభ్యర్థులు ఘన విజయం సాధించడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రతిపక్ష పాత్రలో ప్రతిపక్ష పార్టీలు విఫలం



- పిల్లల చదువులపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు
- - సింగరేణి సహకరిస్తున్నా పిల్లల భవిష్యత్‌ను పట్టించుకోరా
- సింగరేణి సంస్థ చెక్కుచేతల్లో ప్రతిపక్ష పార్టీల నాయకులు
- నెల రోజుల్లోగా పాఠశాలలో సకల సౌకర్యాలు కల్పించాలే
- సంస్థకు జెడ్పి చైర్మన్ పుట్ట మధుకర్ హెచ్చరిక

రామగిరి,సెప్టెంబర్ 14 మనం న్యూస్ : సమస్యల పరిష్కారంలో ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన ప్రతిపక్ష పార్టీలు పూర్తిగా అయ్యాయని బిఆర్ఎస్ పార్టీ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి,జెడ్పి చైర్మన్ మధూకర్ ఎద్దేవా చేశారు.రామగుండం రీజియన్-3 ఏరియా పరిధిలోని రామగిరి మండలం సెంటనరీకాలనీలోని సింగరేణి సంస్థ నుంచి లీజుకు తీసుకొని వాణి సెకండరీ స్కూల్ వారు నిర్వహించే పాఠశాలను ఆయన సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ లీజుకు తీసుకొని వాణి సెకండరీ స్కూల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పాఠశాలలో కనీస వసతులు లేకుండా విద్యార్థులను గాలికి వదిలేశారని ఆయన ఆరోపించారు.అవగాహన లేకుండా పిల్లలకు మంచి సౌకర్యాలు కల్పించడంలో సంస్థలు పూర్తిగా విఫలం అయ్యాయని ఆయన విమర్శించారు. సింగరేణి సంస్థ పరిధిలో ఓసీపీలు,గనుల నడువడానికి తాము సంపూర్ణ సహకారం అందిస్తున్నా మా పిల్లల చదువులపై సంస్థ నిర్లక్ష్యం చేయడం సహించరానిదన్నారు. ఈనాడు సింగరేణి సంస్థ జీఎంలు స్థానికంగా ఉంటున్నా ఇక్కడి పాఠ శాల నిర్వహణపై దృషిసారించకపోవడం దురదృష్టి కరమన్నారు. సంస్థ ఉత్పత్తి లాబాల మీద చూపించే శ్రద్ధ ఉత్పత్తికి కారకులైన కార్మికుల పిల్లల భవిష్యత్‌పై చూపించకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సింగరేణి సంస్థ పరిధిలోని ప్రతిపక్ష పార్టీల నాయకులు కార్మికుల పిల్లల భవిష్యత్ గురించి ఆలోచన చేయకపోవడం,ఇంత జరుగుతున్నా కనీసం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని,ప్రతిపక్షాలు సింగరేణి సంస్థకు అమ్ముడుపోయాయా అని ఆయన ప్రశ్నించారు. ప్రతి పక్షాలు పదవులు,అధికారం,ఓట్ల కోసమే ఆరాటపడుతున్నారే తప్ప కార్మికుల పిల్లలకు మంచి చదువులు అందించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని ఎందుకు ఆలోచన చేయడం లేదని ఆయన అన్నారు. తాము అధికారంలో ఉన్నా కార్మికుల పిల్లల భవిష్యత్ ఆలోచన చేసి ప్రతిపక్ష పాత్ర పోషించాల్సి వస్తోందన్నారు. నెల రోజుల్లోగా పాఠశాలలో సకల సౌకర్యాలు కల్పించ్చలా సింగరేణి సంస్థ చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన,ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అలాగే ఈ ప్రాంతంలో ప్రజాప్రతినిధులు,టీబీజీకేఎస్ నాయకులు నిత్యం కార్మికుల బిడ్డలు చదువుకునే పాఠశాలను పర్యవేక్షించాలని,వసతుల కల్పనపై దృష్టిపెట్టాలని ఆయన స్పష్టం చేశారు.




# పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

## -కుల వృత్తులకు ఇతోధికంగా ప్రోత్సాహం
## : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): కుల వృత్తులను ప్రోత్సహిస్తూ, పేదల అభ్యున్నతికి పాటుపడడమే ధ్యేయంగా కెసిఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో రెండు కోట్లతో, డిచ్పల్లి మండలం నడిపల్లిలో యాభై లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న చేపల మార్కెట్ల నిర్మాణ పనులకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా మోపాల్ మండలం న్యాల్కల్ గ్రామంలోని మాసాని చెరువులో చేప పిల్లలను విడుదల చేసి, మత్స్యకారులతో భేటీ అయ్యారు. ఈ సందదర్భంగా మత్స్య కార్మిక సంఘాల సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, మత్స్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధర్ సిన్హా, కమిషనర్ లచ్చిరాం నాయక్, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, నగర మేయర్ నీతూకిరణ్ తదితరులు మంత్రితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన మత్స్య కార్మికులను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుతం అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని అన్నారు. నీటి వనరులు ఉన్న ప్రతి చోటా వంద శాతం సబ్సిడీపై చేపలు, రొయ్యల పెంపకానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం వల్ల చేపల సంపద గణనీయంగా వృద్ధి చెందిందన్నారు. ఈ నేపథ్యంలో మంచి మార్కెటింగ్ వసతితో మత్స్యకార కుటుంబాలకు మరింత ఆర్థిక పరిపుష్టి కల్పించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం అవకాశం ఉన్న ప్రతి చోట జిల్లా, మండల స్థాయిలలో హోల్ సెల్, రిటైల్ మార్కెట్లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. అంతేకాకుండా 75 శాతం సబ్సిడీపై ఫోర్ వీలర్ వాహనాలు, మోపెడ్ లు, లగేజీ ఆటో రిక్షాలు సమకూరుస్తోందన్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో రాష్ట్రంలో చేపల ఉత్పత్తి రెట్టింపు అయ్యిందని, మార్కెట్లోనూ చేపలకు మంచి డిమాండ్ పలుకుతుండడంతో మత్స్యకారులు అధిక ఆదాయం ఆర్జిస్తున్నారని హర్షం వెలిబుచ్చారు. ఈ దిశగా మహిళలకు కూడా ఆదాయ వనరులు సమకూరేలా ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి మత్స్య కార్మిక సంఘాల్లో సభ్యత్వం కల్పిస్తున్నామని అన్నారు. అంతేకాకుండా ఇదివరకు గ్రామ పంచాయతీల ద్వారా సర్పంచ్ లు లైసెన్స్ లు జారీ చేసే విధానాన్ని తొలగించి, కేవలం మత్స్యకారులకు మాత్రమే మత్స్య శాఖ ద్వారా లైసెన్స్ లు ఇచ్చేలా ప్రభుత్వం జీ.ఓ జారీ చేసిందని వివరించారు. దళారుల వ్యవస్థను పూర్తిగా రూపుమాపి, చెరువులు, జలాశయాల్లో చేపల సంపదపై పూర్తిగా మత్స్యకార్మికులకే హక్కులు కల్పించామన్నారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని మంత్రి హితవు





పలికారు. ముఖ్యంగా చెరువులు, ప్రాజెక్టులలో విడుదల చేస్తున్న చేప పిల్లల నాణ్యతను నిశితంగా పరిశీలించాలని, నిబంధనలకు అనుగుణంగా ఫిష్ సీడ్ ఉందా లేదా అన్నది గమనించాలని సూచించారు. అప్పుడే మత్స్య సంపద గణనీయంగా వృద్ధి చెంది ఆర్థికాభివృద్ధి సాధించేందుకు దోహదపడుతుందని, తద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. మత్స్య కార్మికులకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల మందికి గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 2016 లో మొదటగా 3900 చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, ప్రస్తుతం 24 వేల పైచిలుకు చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేస్తూ రాష్ట్రంలో చేపల సంపదను రెట్టింపు చేసి మత్స్యకార కుటుంబాలలో వెలుగులు నింపుతోందని అన్నారు. పేద ప్రజల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రభుత్వానికి ప్రజలు వెన్నుదన్నుగా నిలువాలని మంత్రి కోరారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడిన మత్స్యకార కుటుంబాలు, స్వరాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు చెరువులన్నీ కబ్జాలకు గురయ్యాయని, మత్స్య కార్మికులు చేపలు పట్టుకుందామంటే చెరువులలో నీటి జాడ ఉండేది కాదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో దూరదృష్టితో మిషన్ కాకతీయ కింద చెరువులను మరమ్మత్తులు చేసిన ఫలితంగా ప్రతి చోటా చెరువులు జలకళతో తొణికిసలాడుతున్నాయని, 100 శాతం సబ్సిడీపై చేప పిల్లలను ప్రభుత్వం అందిస్తూ, వాటి సంపదను పూర్తిగా మత్స్య కార్మికులకే అందిస్తోందన్నారు. చేపల విక్రయాలకు అన్ని సదుపాయాలతో కూడిన మంచి వాతావరణం ఉండాలనే ఉద్దేశ్యంతో చేపల మార్కెట్లను విరివిగా నిర్మిస్తున్నారని అన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని మోపాల్, సిరికొండ తదితర ప్రాంతాల్లోనూ ఫిష్ మార్కెట్లు మంజూరు చేయాలని కోరగా, మంత్రి తలసాని సానుకూలంగా స్పందించారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, జిల్లాలో 1118 చెరువులలో చేప పిల్లలను విడుదల చేస్తూ, మత్స్య సంపదను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అదేవిధంగా ప్రధాన జలాశయమైన శ్రీరాంసాగర్ రిజర్వాయర్ లోనూ చేపలు, రొయ్యల పెంపకం జరుగుతోందన్నారు. గత సంవత్సరం 866 చెరువుల్లో చేప పిల్లల పెంపకం జరుగగా, ఈ ఏడాది 1118 చెరువుల్లో 470 లక్షల చేప పిల్లలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. మత్స్యకారులను ఆర్థిక పురోభివృద్ధి దిశగా ప్రోత్సహించేందుకు సుమారు రూ. 21 కోట్ల రూపాయల విలువ చేసే మోపెడ్ లు, వాహనాలు, ఇతర సదుపాయాలను సమకూర్చడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా 20 ద్విచక్ర వాహనాలు, 75 శాతం రాయితీపై రూ. 11.55 లక్షల విలువ చేసే లగేజీ ఆటో రిక్షాను మంత్రి చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేశారు. న్యాల్కల్ లోని మాసాని చెరువులో 2.74 లక్షల చేప పిల్లలు, 1.37 లక్షల రొయ్య పిల్లలు విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో మత్స్య కార్మిక ఫెడరేషన్ అధ్యక్షుడు టి.మల్లయ్య, ఐడీసీఎంఎస్ చైర్మన్ మోహన్, నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్, సంబంధిత శాఖల అధికారులు, వివిధ మండలాలకు చెందిన జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, మత్స్యకార్మిక సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇడి నోటీసు కాదిది.. మోడీ నోటీసు

## - ఇడి వ్యవహారం టివి సీరియల్ లాగా సాగుతోంది
## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 14(మనం న్యూస్): ఇడి నోటీసుల వ్యవహారం విషయంలో కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో గురువారం మీడియాతో ఆమె మాట్లాడుతూ తనకు పంపినవి ఇడి నోటీసులు కావని, అవి మోడీ నోటీసులని పేర్కొన్నారు. ఎన్నికల సమీపిస్తోన్న నేపథ్యంలో ఇలాంటి బెదిరింపులు సర్వసాధారణమని, నోటీసుల విషయంలో తమ లీగల్ టీమ్ సలహా మేరకు ముందుకు వెళ్తామన్నారు. ఇడి వ్యవహారం ఒక టివి సీరియల్ లాగా సాగుతోందని కవిత వ్యాఖ్యానించారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా తాను భయపడేది లేదని, వారు పంపిన నోటీసులకు సరైన సమాధానాలిస్తామన్నారు.

# పల్లెల్లో ఘనంగా పొలాల అమావాస్య పండుగ



బోధన్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): తెలంగాణ యావత్తు పల్లెప్రజలు సంతోషంగా జరుపుకునే పండుగ పొలాల అమావాస్య. గురువారం శ్రావణ అమావాస్య సందర్భంగా పొలాల అమావాస్య పర్వదినాన్ని బోధన్ మండల వ్యాప్తంగా రైతులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పల్లెలన్నీ సందడిగా మారాయి. ఆరుగాలం శ్రమించే రైతన్నలకు నేస్తాలుగా పిలువబడే ఆవులు, ఎద్దులను రైతులు రంగురంగుల వస్త్రాలతో ముస్తాబు చేశారు. వాటి కొమ్ములకు రంగులు అద్ది అందంగా అలంకరించారు.డప్పు చప్పుల్లతో, పల్లె ప్రజల కేరింతల నడుమ వీధులలో ఎద్దులను ఊరేగించి దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.బస్వన్నలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వాటికి ప్రత్యేక నైవేద్యాలను సమర్పించి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట గంగాధర్, సర్పంచ్ కృష్ణప్రసాద్, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సహస్రార్జున మందిర నిర్మాణ కమిటీ ఏర్పాటు

## కమిటీ కన్వీనర్, కో కన్వీనర్లకు సన్మానం

ఆర్మూర్, సెప్టెంబర్ 14:( మనం న్యూస్ ) ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్ధుల గుట్టపై క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నిర్మించే సహస్రార్జున మందిర నిర్మాణ కమిటీ కన్వీనర్ గా డీకే రాజేష్, కో కన్వీనర్ గా హజారి సతీష్ లను సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు హజారి మదన్ మోహన్, కార్యదర్శి భారడ్ గంగా మోహన్ లు గురువారం నియమించారు. సహస్రార్జున మందిర నిర్మాణ కమిటీ కన్వీనర్, కో కన్వీనర్ గా నియమించబడ్డ డీకే రాజేష్, హజారీ సతీష్ లను మున్సిపల్ చైర్మన్ పండిత్ వినీత పవన్, అధ్యక్ష కార్యదర్శులు హజారీ మదన్ మోహన్, భారడ్ గంగా మోహన్, ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి పండిత్ ప్రేమ్ పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. కమిటీ సభ్యులుగా బోబిడే గంగా కిషన్, జెస్సు శ్రీనివాస్, అల్జాపూర్ వీరేంద్ర లను నియమించారు. అతి త్వరలో సహస్రర్జున ఆలయ నిర్మాణ కమిటీ పనులు ప్రారంభిస్తామని కన్వీనర్, కో కన్వీనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రెడ్డి ప్రకాష్, జెస్సు ఆనంద్, సర్వసమాజ్ ఉపాధ్యక్షులు వైద్య రవీందర్, మాజీ అధ్యక్షుడు పడాల్ గణేష్, సభ్యుడు సాత్ పుతె శ్రీనివాస్, షికారి రాజు పాల్గొన్నారు.

